క్లుప్తంగా

సర్వే వేగవంతం చేయండి : ఎంపీడీఓ శ్రీలలిత



వేట్లపాలెంలో సచివాలయ కార్యదర్శుల సమీక్షలో ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: సచివాలయ సిబ్బందికి ఇచ్చిన సర్వేలను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. బుధవారం వేట్లపాలెం మూడో సచివాలయంలోని సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆమె పాల్గొన్నారు. ఎస్‌డీజీ సర్వే, ఆయుష్మాన్ భారత్ సర్వేలపై ఆమె సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శి మోసే, సచివాలయ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై విచారణ

సామర్లకోట: మండల పరిధిలోని వేట్లపాలెం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కె.సురేఖ అవినీతిపై బుధవారం ఉపాధి పథకం ఏపీఓ విచారణ చేశారు. గ్రామానికి చెందిన జె.వీరమణికంఠ గత సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్, ఎంపీడీఓలకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. మేట్‌లను మచ్చిక చేసుకుని పనులకు రాని వారి పేరున మస్తర్లు వేసి ఆమె సొమ్ములు స్వాహా చేస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. వారి పేరున డబ్బులు బ్యాంకు నుంచి డ్రా చేసి ఇచ్చే సమయంలో సగం వారికి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారించి ప్రభుత్వ సొమ్ము వృథా కాకుండా చూడాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ డి.శ్రీలలితను వివరణ కోరగా తమకు అందిన ఫిర్యాదు మేరకు ఏపీఓ విచారణ చేసి అవినీతి జరిగినట్టు గుర్తించారని, ఫీల్డు అసిస్టెంట్‌ను తాత్కాలికంగా విధులకు దూరంగా ఉంచామని తెలిపారు. డ్వామా పీడీ నిర్ణయం కోసం విచారణలో విషయాలను పంపినట్టు తెలిపారు.

ప్రగతి పథంలో పాఠశాలలు



పాఠశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ వేణుగోపాల్

కొత్తపల్లి: నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని ఎంఈఓ వేణుగోపాల్ అన్నారు. వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పాఠశాల నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. రెండో విడతకు సంబంధించిన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

పిఠాపురం: బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని పిఠాపురం కత్తులగూడెంలో బుధవారం నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కండవిల్లి లోవరాజు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా కాన్షీరామ్ పయనించారన్నారు. నాయకులు నూకరాజు, టి.సుబ్బారావు, ఎం.అన్నవరం, ముకేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఎం.రామ్మోహన్ తెలిపారు. ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023 అవార్డులకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. వ్యక్తిగత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త వినియోగం, వంటి విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 22వ తేదీ లోపు స్థానిక మెప్మా కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని అన్నారు. విజేతలకు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున అవార్డులు అందజేస్తామన్నారు.

వినియోగదారుల హక్కులు సద్వినియోగం చేసుకోవాలి

బాలాజీచెరువు: వస్తు సేవల్లో నష్టం కలిగితే వినియోగదారులు తమ హక్కులను సద్వినియోగంచేసుకోవాలని జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ చెరుకూరి రఘుపతి వసంతకుమార్ పేర్కొన్నారు. పీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. వసంత కుమార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతిరోజూ ఏదో వస్తువు కనుగోలు చేస్తామని, నాణ్యత, సేవలు తదితర వాటిలో లోపం వస్తే ఈ ఫోరం ద్వారా న్యాయం పొందవచ్చన్నారు.

మండుటెండలో మాధుర్యం

- పుచ్చకాయతో ఆరోగ్యానికి మేలు
- నియోజకవర్గంలో జోరుగా వ్యాపారం
- మొత్తం 60 హెక్టార్లలో సాగు



కొత్తపల్లి: మండుటెండలో పుచ్చకాయ తింటే ఆ హాయే వేరు.. ఒక్కసారిగా శరీరానికి శక్తి వస్తుంది. ఇది ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. ఇందులో అధిక శాతం నీరు ఉండడంతో దాహార్తి తీరుస్తుంది. అందుకే వేసవి వచ్చిందంటే పుచ్చకాయల వ్యాపారం జోరందుకుంటోంది. పుచ్చకాయ అనేక రోగాలకు దివ్య ఔషధం కావడంతో రోజురోజుకూ గిరాకీ పెరుగుతోంది. శరీరంలో నీటి శాతాన్ని తగ్గనివ్వకుండా చూసే ఈ కాయ.. క్యాన్సర్ నివారిణిగానూ పేరొందింది. ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గం పరిధిలో తాటిపర్తి, వన్నెపూడి, కోనపాపపేటలతో పాటు పలు మెట్ట ప్రాంతాల్లో పుచ్చకాయల సాగును 60 హెక్టార్లలో రైతులు చేస్తున్నారు. ఈ సాగు మరింత పెంచేందుకు మిగతా రైతులూ ఆసక్తి చూపుతున్నారు. పుచ్చకాయలో బీటా కెరోటిన్ ఎక్కువ మోతాదులో ఉండడంతో గొంతు, ఊపిరితిత్తులు, స్వర పేటిక క్యాన్సర్‌లు దరిదాపుల్లోకి రాకుండా చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మూత్రంలో రాళ్లు తయారైనప్పుడు విరోచనాలు, గ్యాస్ట్రిక్, వికారం వంటి సమస్యలను నివారిస్తుంది. గ్లూకోజ్, తేనె వంటికి కలిపి రోజూ తాగుతారు. పుచ్చకాయల విత్తనాలను కూడా పౌడర్‌గా చేసి వాడతారు.

అందుబాటు ధరల్లోనే..

మన ప్రాంతంలో పండించే పుచ్చకాయలు మధురంగా ఉండడంతో డిమాండ్ అధికంగా ఉంటుంది. అంతేకాకుండా ఉమ్మడి జిల్లాతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలో పుచ్చకాయ పంటను ఎక్కువగా పండిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి కూడా ఇక్కడకు దిగుమతి అవుతున్నాయి. పుచ్చకాయ బరువును బట్టి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా కిలో నుంచి 8 కిలోల వరకూ బరువు ఉంటుంది. కిలో రూ.20 నుంచి 30 చొప్పున అమ్ముతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారులైన పిఠాపురం–గొల్లప్రోలు, పిఠాపురం– సామర్లకోట, పిఠాపురం– కాకినాడ, పిఠాపురం– ఉప్పాడ, ఉప్పాడ– కోనపాపపేటతో పాటు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో పుచ్చకాయల వ్యాపారం జోరుగా సాగుతుంది. కొన్ని ప్రాంతాల్లో సైజును బట్టి రూ.80–150 ధర పలుకుతుంది.

దాహార్తి నుంచి రక్షణ



పుచ్చకాయలో 82 శాతం నీరు ఉండడంతో ఇది శరీరానికి కావాల్సిన చల్లదనాన్ని ఇస్తుంది. దాహార్తిని తీర్చుతుంది. రక్తనాళాలు గట్టిపడి బిగుసుకుపోకుండా కాపాడుతుంది. చిన్నారులు ఎక్కువగా తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మెగ్నీషియం, పొటాషియం గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. ఇందులో సమృద్ధిగా లభించే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో తిరుగాడే హానికర ఫ్రీరాడికల్స్‌ను అణిచివేయడం ద్వారా ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

– మౌనిక, వైద్యాధికారి, కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు



పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రిన్సిపాల్ టి.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పెద్దాపురానికి చెందిన ప్రగతి జూనియర్ కళాశాల, మహారాణి కళాశాల, సామర్లకోట కేఎస్ఎన్, సాయి ఐశ్వర్య జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌గా ఇచ్చారు. ఈ పరీక్ష కేంద్రంలో 481 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా 17 మంది గైర్హాజరు కాగా, 464 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్ష రాశారు.

బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు

స్థానిక ఆంధ్రా బాప్టిస్టు చర్చిలో విద్యార్థులకు జ్ఞాపకశక్తి, జ్ఞానం, మంచి ఆరోగ్యం ఇవ్వాలని సంఘ కాపరి బి.కిరణ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష అట్టలు, స్కేళ్లు, పెన్నులు అందజేశారు. సంఘ నాయకులు బీఎస్ వందనం, టి.సూర్యారావు, బి.అన్నపూర్ణ, పి.సత్యనారాయణ అందజేశారు.

పిఠాపురం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు పిఠాపురంలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్షలకు 80 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పిఠాపురం పట్టణంలో పరీక్షల నిర్వహణకు నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 333 మందికి 319 మంది, హనుమంతరాయ కళాశాలలో 272 మందికి 238 మంది, అంజనా కాలేజీలో 164 మందికి 151 మంది, సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాలలో 240 మందికి 221 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 144వ సెక్షన్ అమలు చేశారు.

ఆపదమిత్రలు అప్రమత్తంగా ఉండాలి

- ఈటీసీ మేనేజర్ శ్రీనివాసరావు
- రెండో రోజు కొనసాగిన శిక్షణ



సామర్లకోట ఈటీసీలో ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్న శ్రీనివాసరావు

సామర్లకోట: ఆపద మిత్రలు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఈటీసీ మేనేజరు పి. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఆపద మిత్రలకు ఇస్తున్న శిక్షణలో భాగంగా ప్రకృతి వైపరిత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర కమ్యూనికేషన్ కోసం సెల్ ఫోన్లకు నిత్యం చార్జింగ్ ఉండాలన్నారు. వాతావరణ హెచ్చరికల కోసం ఎస్ఎంఎస్‌లను గమనించాలని, టీవీ, వార్త పత్రికలను చదవాలన్నారు. భద్రత, మనుగడ కోసం అవసరమైన వస్తువులతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. తుఫాన్, ఉప్పెనలు వంటివి సంభవించిన సందర్భాల్లో వారం రోజుల పాటు ఉండడానికి అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. తరుచూ స్థానిక అధికారులకు అందుబాటులో ఉండాలన్నారు. తుఫాన్, వరదల హెచ్చరికలలో మత్స్యకారులను వేటకు వెళ్లకుండా చూడాలని, అధికారిక సమాచారం వచ్చే వరకు ప్రజలను బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. ప్రజలతో వలంటీర్లు, ఆశావర్కర్లు దగ్గర సంబంధాలు కలిగి ఉండడం వల్ల ఆపద మిత్రలుగా వారిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. తరగతి గదిలో చెప్పిన విషయాలతో పాటు ఫీల్డు విజిట్‌లో గమనించిన విషయాలను ఎప్పటికప్పుడు నోట్ చేసుకోవాలన్నారు. వెంకటేశ్వరరావు, ఎస్‌కె మోహిద్దీన్, నిహారికలు రెండవ రోజు శిక్షణ ఇచ్చారు.

ఎఫ్‌పీఓలతో రైతులకు ప్రయోజనాలు



రైతుకు సభ్యత్వ నమోదు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు

పిఠాపురం: రైతు ఉత్పత్తిదారుల సరస్పర సహాయక సహకార సంఘం ఎఫ్‌పీఓల ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతున్నాయని, వాటిని వినియోగించుకోవాలని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్ర హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు సూచించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో బుధవారం పందూరుకు చెందిన మైత్రి రైతు ఉత్పత్తిదారుల సరస్పర సహాయక సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నాయుడు, ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయ ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు, మైత్రి ఎఫ్‌పీఓ సంఘం సీఈఓ జి.అశోక్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రైతు దేవుళ్లు హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ 414 మంది రైతులు పందూరు మైత్రి రైతు ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యత్వాలు నమోదు చేసుకున్నారన్నారు. భవిష్యత్తులో మరింత మంది సభ్యులుగా చేరే అవకాశం ఉందన్నారు. మిరప పంటపై ఆశించిన నల్ల తామర పురుగు ఉధృతి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పొట్టి మిరప రకం డిమాండ్ అధికంగా ఉంటుందని, దీనిపై శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపేలా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. సుమారు 100 మంది రైతులకు సభ్యత్వ నమోదు పత్రాలు, రైతు వాటా సర్టిఫికెట్లు అందజేశారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్స్, రైతులు, రైతు సంఘం సభ్యులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి



వాకతిప్పలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విక్టర్

కొత్తపల్లి: గ్రామాల్లో ప్రజా సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ సూచించారు. బుధవారం మండలంలోని వాకతిప్ప, కొత్తపల్లిలలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం పంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్ మాట్లాడుతూ వీధి దీపాలు పగలు కూడా వెలుగుతున్నాయని జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. వీటి నిర్వహణపై అలసత్వం వహించిన పలువురి కార్యదర్శులను సస్పెన్షన్ కూడా చేశామన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి పెట్టాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు ప్రాజెక్టులలో నీటిని నిల్వ చేయాలని, పైపులైన్లు మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. వీధి కుక్కల సంతాన ఉత్పత్తి తగ్గించేందుకు పశువైద్య సిబ్బందితో కలసి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని అన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. ఎంపీడీఓ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మాలయలో గణా చిత్ర ఆవిష్కరణ

- 17న ప్రపంచవ్యాప్తంగా విడుదల



గణా చిత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హీరో విజయ్‌కృష్ణ, ఎన్.బుచ్చిరెడ్డి తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక మెయిన్‌రోడ్డులోని పద్మాలయ స్టూడియోలో యువ నటుడు విజయ్‌కృష్ణ నటించిన గణా చిత్ర బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో విజయ్‌కృష్ణ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా గణా చిత్రాన్ని నిర్మించామని తెలిపారు. ఈనెల 17న ప్రపంచవ్యాప్తంగా 400 థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. నాయకుడు, ప్రతినాయకుడు, క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కాకినాడకు చెందిన ఎంతో మంది చిత్ర పరిశ్రమలోకి వెళ్లి ఖ్యాతి గడించారన్నారు. చిత్ర హీరో విజయ్‌కృష్ణ స్వయంగా కథ తయారు చేసుకుని స్వీయ దర్శకత్వంలో చిత్రాన్ని నిర్మించారని నిర్మాతలు సాయికృష్ణారెడ్డి, ఎన్.బుచ్చిరెడ్డి, బాలప్రసాద్‌అన్నారు. ఎక్కడా డూప్ లేకుండా రిస్క్ తీసుకుని ఆయన నటించారని తెలిపారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా చిత్రం సాగుతుందని అన్నారు. ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరించలనీ కోరారు. చిత్రయూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: వినియోగదారుల చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. డివిజన్ స్థాయిలో వినియోగదారుల సంఘం ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకువాలన్నారు. సినిమా హాళ్లలో మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోయినా, అసౌకర్యంగా అనిపించినా వినియోగదారుల తరఫున ప్రశ్నించవచ్చన్నారు. గ్యాస్ డెలివరీ బాయ్స్‌కు అదనపు సొమ్ములు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కిరాణా, కూరగాయాలు కొనుగోలు చేసేటప్పుడు తూకాలు సరిగ్గా చూడాలని, తేడాలు ఉంటే వినియోగదారులు తమ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని ఆర్డీఓ అన్నారు. అనంతరం పలు అంశాలపై ఆయన చర్చ నిర్వహించారు. పలువురు ప్రతినిధులు, వినియోగదారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు సమానత్వం దిశగా సాగాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న వివిధ సంఘాల మహిళా ప్రతినిధులు

కాకినాడ సిటీ: శ్రామిక మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సుందరయ్య భవన్ ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. సీఐటీయూ, శ్రామిక, మహిళ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని నినదించారు. బాలికలు, వృద్ధులు అనే తేడా లేకుండా మహిళలపై అత్యాచారాలు, హింస జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు రాజ్యాసభ ఆమోదం పొంది నేటికీ లోక్ సభలోకి రాలేదన్నారు. విద్యా ఉపాధి కల్పన ద్వారా మహిళా సాధికారత సాధించి, సామాజిక రాజకీయ రంగాల్లో సమానత్వ దిశగా సాగాలన్నారు. ఇందుకోసం ఐక్య పోరాటాలు అవసరమన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు దడాల పద్మ, జి.బేబీరాణి, సీహెచ్ రమణి, కె.దుర్గాదేవి, కె.నాగజ్యోతి, ఈ చంద్రావతి, ఎన్.ఈశ్వరి, రమణమ్మ, రాజేశ్వరి తదితరులు మాట్లాడారు. అనంతరం సుందరయ్య భవన్ నుంచి మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రామిక మహిళా సంఘాల నాయకులు టి.నాగమణి, ధనలక్ష్మి, దాడి బేబి, అమలావతి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలకు గుర్తింపు



ఏడీసీ నాగనరసింహారావును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కాకినాడ: విధి నిర్వహణలో అంకిత భావంతో చేసిన సేవలే సంతృప్తినిస్తాయని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. పుర పరిపాలన శాఖ రీజినల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన నాగనరసింహారావును మున్సిపల్ సుపీరియర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. వివిధ విభాగాధిపతులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఆయనను సన్మానించారు. నాగ నరసింహారావు మాట్లాడుతూ 22 ఏళ్ల సర్వీసులో ప్రతి ప్రాంతంలోను ఉద్యోగుల సహకారంతో సంతృప్తికరమైన సేవలు అందించానన్నారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలకు వేగవంతంగా నాణ్యమైన పరిష్కారాన్ని ఇవ్వగలినప్పుడే ఉద్యోగ ధర్మాన్ని నెరవేర్చగలమని, ఉద్యోగులంతా ఆ దిశగా పనిచేయాలని సూచించారు.

పది వాహనాల సీజ్

పెద్దాపురం: లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని రవాణా శాఖాధికారి రుద్రపాటి సురేష్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలో మైనర్లు, త్రిబుల్ రైడ్ వాహనాలను ఆపి పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పది వాహనాలకు అపరాధ రుసుము విధించి కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎంవీఐ సురేష్ తెలిపారు. సుమారు రూ.50 వేలు అపరాధ రుసుముతో పాటు కేసు నమోదు చేసినట్లు ఎంవీఐ సురేష్ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో పరిశుభ్రంగా ఉన్న ఒకటో నంబరు ప్లాట్‌ఫారం

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రైల్వే ప్లాట్‌ఫాంపై నిత్యం తాగునీరు వచ్చే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రయాణికులు చెత్తను డస్టు బినులలోనే వేయాలన్నారు. ప్రయాణికులు వారు ఎదుర్కొనే ఇబ్బందులు, సూచనలు, సలహాలు ఉంటే ఫిర్యాదులను స్టేషన్ ఆవరణలో ఉన్న బ్యాక్స్‌లో వేయాలన్నారు. ఇటీవల ప్రయాణికులు మూడో ప్లాటుఫాంపై ఉన్న కుళాయిల నుంచీ నీరు రావడం లేదని నాచు పట్టి ఉన్నాయనే ఫిర్యాదుల మేరకు అన్ని కుళాయిలను శుభ్రం చేయించామన్నారు.

జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా వైడీఆర్



రామారావు

కాకినాడ: దక్షిణ మధ్య రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ (జెడ్ఆర్‌యూసీసీ) సభ్యునిగా వైడీ రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి దివంగత ఎస్ఎస్ కృష్ణాజీ సారథ్యంలో 1959లో స్థాపించిన రైల్వే ప్రయాణికుల సంఘం తరపున ఆయనకు ఈ ప్రాతినిధ్యం కల్పించారు. కాకినాడ, జిల్లా ప్రయాణికుల సంఘ అధ్యక్షుడిగా ఆయన కొనసాగుతున్నారు. దాదాపు దశాబ్దకాలంగా ఆయన జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా, డీఆర్‌యూసీసీ సభ్యుడిగా ఈ పదవిలో కొనసాగుతూ రైల్వే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసి ప్రత్యేక గుర్తింపు సాధించారు. కాకినాడ–విశాఖ పాసింజర్‌లో టాయ్‌లెట్ సదుపాయంకల్పించడం నుంచి, కాకినాడ–సామర్లకోట రైల్వే స్టేషన్లలో లిఫ్ట్ సదుపాయాలు, సామర్లకోటలో ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం, కాకినాడ–ముంబాయి రైలు సాధన వంటి అనేక అంశాల సాధనలో ఆయన కృషి చేశారు. ప్రతి రైల్వేబోర్డు సమావేశంలోను జిల్లాకు సంబంధించిన అనేక అంశాలు ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోస్తా రైలు మార్గం, కొవ్వూరు–సత్తుపల్లి రైలు మార్గం, ప్రస్తుతం ఉన్న రైళ్లకు అదనపు భోగీల ఏర్పాటు, నూతన రైళ్లను ప్రవేశపెట్టడం, సామర్లకోటలో సూపర్‌ఫాస్ట్ రైలు నిలుపుదల వంటి అంశాలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనను జెడ్ఆర్‌యూసీసీ సభ్యునిగా కొనసాగించిన రైల్వే అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

లేపాక్షిలో విక్రయాలపై డిస్కౌంట్

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని లేపాక్షి షోరూమ్‌లో క్లియరెన్స్ సేల్ సందర్భంగా ఎంపిక చేసిన వస్తువుల కొనుగోలుపై 10 నుంచి 40 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు లేపాక్షి మేనేజర్ సీహెచ్ వీరబాబు బుధవారం విలేకర్లకు తెలిపారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, చేనేత వస్త్రాలు, లెదర్ ల్యాంప్స్, బంజారా, లెదర్‌వేర్, కార్పెట్లు, కళంకారీ బెడ్‌షీట్లు, కళంకారీ శారీస్, బ్లాక్‌మెటల్ క్రాఫ్ట్స్, శహరాన్‌పూర్ ఉడ్ కార్వింగ్ ఈ డిస్కౌంట్ సేల్స్‌లో లభిస్తాయన్నారు. ఈ అవకాశం 31 వరకూ మాత్రమే ఉందన్నారు.

రొయ్యల సాగుపై శిక్షణ

బాలాజీచెరువు: ముంబాయిలోని కేంద్రీయ మత్స్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ మత్స్యకార శిక్షణ కళాశాలలో నైపుణ్యాభివృద్ధిపై రొయ్యల పెంపకం అంశంపై శిక్షణ ఇచ్చారు. షెడ్యూల్ కులాలకు చెందిన యువకులు, రైతులకు పదిరోజుల పాటు శిక్షణ ఇచ్చి బుధవారం ముగించారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎస్‌సీఎస్‌పీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించగా కేంద్ర మత్స్యశిక్షణ సంస్థ డైరెక్టర్, వీసీ డాక్టర్ సీఎన్ రవిశంకర్ సర్టిఫికెట్లు అందజేశారు. నోడల్ అధికారి శ్రీనివాస్, డాక్టర్ మురళీధర్ అందే, సైంటిస్ట్ శ్యామల, పి.శ్రీనివాసరావు, ఉషారాణి పాల్గొన్నారు.

గణాంక శాస్త్రంపై అవగాహన

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణాంక శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా గణాంక విభాగ డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ హాజరై గణాంకశాస్త్రం అభ్యసించే విద్యార్థులకు ఉండే ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో వాటిపాత్రను వివరించారు. గణాంక శాస్త్ర విభాగం ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించే విధానాలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెన్నారావు, అధ్యాపకులు జ్యోతి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కిర్లంపూడి: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రమణయ్యపేటకు చెందిన దాడి సీతారాములు (46) మంగళవారం స్థానిక రామాలయం వద్ద ఏకాహాన్ని పురస్కరించుకుని చలువ పందిరి వేస్తున్నాడు. పైకెక్కి అడ్డుకర్రలు కడుతూ జారి రోడ్డుపై పడిపోయాడు. వెంటనే అతన్ని స్థానికులు ఆటోలో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సీతారాములు మరణించినట్లు ఎస్సై వివరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, బాబు, పాప ఉన్నారు. ఇంట్లో పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.